# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

# భానుమతి

## ( సినిమారంగం 1963, జనవరి సంచిక నుంచీ)




సినీ కెమేరా ఎప్పుడైనా మీ హృదయంలోకి చొచ్చుకు పోయిందా ? వెండితెరతో మీరెన్నడైనా ఐక్యమైపోయారా ?

ఏ.వి.యం. వారి 'అణ్ణయ్' అనే తాజా తమిళ చిత్రం చూస్తూంటే మీకా అనుభూతులు కలుగుతాయి. ఆ చిత్రంలో ఒక కొత్త భానుమతి కనిపిస్తుంది; నటిగా మరో పదేళ్ళు ముందుకు పురోగమించిన భానుమతి కనిపిస్తుంది. 'మాయామృగ్' అనే ప్రఖ్యాత వంగ నవల ఆధారంగా నిర్మించబడిన ఆ తమిళ చిత్రంలో ఇంకా ఎస్.వి.రంగారావు, హరనాథ్, జానకి మున్నగు తెలుగు తారలతో పాటు ఆరితేరిన తమిళ తారలు కూడా నటించారు. కాని, భానుమతి పక్కన వాళ్ళెవరూ మనకు కనిపించరు. థియేటర్ నించి బయటకు వచ్చాక కూడా భానుమతి ఆ చిత్రంలో ప్రదర్శించిన హావభావ అభినయాలే మన కళ్ళ ముందు మెదులుతుంటాయి.

ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆ చిత్రంలో ఆ పాత్ర భానుమతి కోసమే పుట్టింది; భానుమతి ఆ పాత్ర కోసమే పుట్టింది. ఇదెంత మాత్రం నిజమో త్వరలో తెలుగులో కూడా వెలువడే ఆ చిత్రంలో మీరూ చూస్తారుగా.

భానుమతి త్వరలోనే తన 'ఆత్మకథ' రచనకు ఉపక్రమించబోతోంది. అంచేత ఇక్కడ 'నటి'గా ఆమె జీవితం గురించే మీరు ఎక్కువగా తెలుసుకుంటారు.

అసలు తొలుదొల్త భానుమతి కెమేరా ముందు నటించలేదు. క్రమక్రమంగా అమె ధరించిన పాత్రలే ఆమెను నటిగా తీర్చి దిద్దాయి. ఆ పాత్రలే ఆమెకు ఎనలేని పేరు ప్రతిష్టలు సంపాదించి పెట్టాయి.

ఆమె 'నటి భానుమతి' గా కాక 'ఒట్టి భానుమతి' గా ఉన్న రోజులవి..

అప్పుడామె వయసు పదమూడు, అప్పట్లో ఆమెకు తెలిసిందల్లా ఆమె నాన్నగారు చూపే త్రోవలో నడవడం,

ఆయన చెప్పినట్లు చేయడం, లేకపోతే ఎవరైనా పాడిన పాటను అనుకరించి కూనిరాగాలు తీయడం.

తన కంఠంలోని మార్దవాన్ని, మాధుర్యాన్ని అందరూ మెచ్చుకుంటున్నారన్న విషయాన్ని కూడా ఆమె గుర్తించలేని అమాయకురాలు ఆ రోజుల్లో. అలాంటి అమాయకురాలికి మొట్ట మొదటిసారిగా 'వరవిక్రయం' చిత్రంలో పేదపిల్ల వేషం లభించింది, ఆ చిత్రకథ ఏమిటి. అందులో ఆమె ధరించబోయే పాత్ర స్వభావం ఎలాంటిది అన్న విషయాలేవీ ఆమెకు తెలియనే తెలియవు. తెలిసిందల్లా ఆమె నాన్నగారు ఎలా చేయమంటే అలా చేయడం.. అంతే.

“అమ్మాయ్, నువ్వు కష్టపడి చేయవలసిందేమీ లేదు. 'వరవిక్రయం' లోని పేదపిల్ల పెద్దల కట్టుబాట్లలో ఉన్న పిల్లే నువ్వు మామూలుగా ఇంట్లో ఎలా మసలుతావో అలాగే కెమేరా ముందు నడుచుకో. అంతే,” అన్నారు ఆమె నాన్నగారు.

అడ్డు చెప్పే అలవాటో, లేక పెద్దల మాటకు ఎదురు చెప్పే ధైర్యమో ఏ పల్లెటూరి పిల్లకు ఉంటుంది? అంచేత, ఆ అమ్మాయికి నాన్నగారు గీచిన గీతలో నడవడమే అప్పుడు తెలిసిందల్లా..

ఇక ఆమెతో పాటు ఆమె నాన్నగారు కూడా కెమేరా పక్కనే హమేషా ఉండిపోవలసి వచ్చింది. అప్పుడే ఆమెలో ఏదో చైతన్యం ప్రవేశించేది ఏదైనా; పని మీద ఆమె తండ్రి కాస్త కనుమరుగైతే చాలు ఆమె నోటి వెంబడి డైలాగులు వచ్చేవి కావు. కొయ్యబొమ్మలా అచేతనంగా నిలుచుండి పోయేది.

ఆ చిత్రంలో ఆమె సంభాషణలనీ పక్కన ఉన్న సహ నటీనటుల్ని చూసి ఎన్నడూ మాట్లాడిన పాపాన పోలేదు ఎదురుగా ఉన్న తండ్రిని చూస్తూనే డైలాగులు వల్లించింది.

“రామ్మా.. కూర్చో.. లే... మాట్లాడు...” అని డైరక్టర్ గారు తన ధోరణలో తాను చెప్పేవారు. ఆయన చెప్పినట్లల్లా ఆమె చేసేదే కాని, వొంచిన తల మటుకు పైకి ఎత్తేది కాదు.

ఆ చిత్రంలో 'పెళ్ళి చూపుల ఘట్టం'.... ఆ ఘట్టంలో తన ఇంట్లో తనకే పెళ్ళి చూపులు ఏర్పాటైనట్లుగా భావించుకుందామె. ఆ ఘట్టం పూర్తిగా చిత్రీకరింపబడే వరకు ఆమె వొంచిన తల ఎత్తలేదంటే నమ్మండి. అప్పుడేదో పాట పాడమన్నారు కూడా. అలాగే పాడిందామె.

ఆ దృశ్యం అత్యద్భుతంగా తయారైందని అనుకున్నారంతా. అందులో అతిశయోక్తి ఏమీ లేదు, ఇంతకీ. ఆ ఘట్టంలో ఆమె 'ఆమె' గానే ఉందే కాని, అసలెక్కడ నటించింది ?

'లిప్ స్టిక్ – మేకప్' ఇత్యాదులు భానుమతికి కొత్తగా పరిచయమయ్యాయి అప్పుడే. ముఖమంతా బిగదీసుకున్నట్లుగా చిరచిరలాడుతూంటే, చేత్తో తడుముకుని, మేకప్ ని పాడు చేసుకునేదామె కొత్తల్లో.

ఆ చిత్రంలో అమె కోసం ప్రత్యేకంగా దుస్తులేవీ తయారు చేయబడలేదు. ఆమె ఇంట్లో ధరించే పావడా, ఓణీలతోనే కెమేరా ముందు నిలుచునేది. ఆ దుస్తులు కూడా తను నటిస్తున్నాననే భ్రమను ఆమెలో కలుగనీయకపోవడానికి ఓ కారణం అని చెప్పకతప్పదు. ఆ దుస్తుల వల్లే 'హోమ్లీ' గా ఉండడానికి వీలయ్యేది. ఆ రోజుల్లో ఆమె ఖద్దరు మాత్రమే వాడేది.

ఆమె ఆశలు, ఆశయాలతో, ఆమె మనఃప్రవృత్తికి అనుగుణంగా ఉండడం వల్లే ఆ 'వరవిక్రయం' లోని కథానాయకి కాళింది పాత్ర ఆమె విజయానికి తొలి సోపానమని చెప్పక తప్పదు. ఆ పాత్ర ఆమె స్వభావానికి అన్ని విధాలా సరిపోయింది గనుకనే ఆమె ఏ మాత్రం కష్టపడవలసిన అవసరం, నటించాల్సిన అవస్థ లేకుండానే నలుగురి మెప్పుదలను సంపాదించుకోగలిగింది.

ఆ చిత్రంలో మహాకవి స్వర్గీయ బలిజేపల్లిగారు ఆమెతో పాటు నటించారు. ఆయన స్వయంగా కాస్త పొదుపరి. ఆయన 'లోభి' పాత్ర ధరించారు ఆ చిత్రంలో! తనకు మల్లేనే ఆయన స్వభావానికి తగ్గ పాత్ర అయనకు లభించడం ఎంత విచిత్రం అనుకునేది భానుమతి.

“మాలతీ మాధవం, భక్తిమాల” వగైరా చిత్రాలలోని ఆమె నటన గురించి చాలా పత్రికలు ప్రశంసిస్తూ రాసిన విషయాల గురించి తెలుసుకొని కూడా ఆమె సంతోషించలేకపోయేదంటే, అప్పుడు ఆమె ఎంత అమాయకురాలో మీరు ఊహించుకోగలరనుకుంటాను. కుమార్తె నటన గురించి పొగుడుతూ రాసిన వాక్యాలను చదివి తన తండ్రి మురిసిపోతున్నందుకే ఆ అమ్మాయి సంతోషించేది ఆ రోజుల్లో..

ఇప్పుడవన్నీ తలచుకుంటుంటే తమాషాగా ఉంటుందామెకు.

ఇక్కడ ఒక్క ముక్క మాత్రం చెప్పి తీరాలి. భానుమతి 'భానుమతి' గానే ఉండిపోయిన 'వరవిక్రయం' చిత్రంలోని పాత్రలాంటిది మాత్రం మళ్ళీ ఇంతవరకూ లభించనే లేదామెకు.

ఆమె జీవితంలో మంగళవాద్యాలు వినిపిస్తున్న శుభక్షణాలవి... 'కృష్ణప్రేమ' చిత్రంలో నటిస్తూండగా 1943 లో ఆ చిత్రానికి సహాయ దర్శకుడుగా పని చేస్తున్న శ్రీ రామకృష్ణారావుతో ఆమెకు వివాహమైంది.

ఇక సినిమా వద్దు, నటనవద్దు శ్రీవారికి ఇంత వండి పెట్టి ఇంటి పట్టునే ఉండి పోవడం చాలని నాన్నగారూ, ఆమే నిశ్చయించుకున్నారు.

కుంపటికి ఆమె దగ్గరయినా కెమేరాకు మాత్రం దూరం కాలేకపోయింది.

'స్వర్గసీమ' కథను చేతబట్టి, శ్రీ బి.ఎన్.రెడ్డి గారు ఓ రోజు ఆమెను కలుసుకున్నారు. ఆ చిత్రంలో ఆమెను ఒక పాత్ర ధరించాలన్నారు. సుబ్బి – సుబ్బులక్ష్మి – సుజాత అనే మూడు విభిన్న మనఃప్రవృత్తులు గల పాత్ర అది.

సుబ్బి – ఒక పల్లెటూరి పిల్ల. అమాయకురాలు – కాని, దుడుకుతనం ఎక్కువ. ఆ కేరెక్టర్ తన కోసమే పుట్టిందేమో అనిపించిందామెకు.

ఆ తర్వాత సుబ్బులక్ష్మి – ఇది కూడా ఫరవాలేదు.

చివరికి సుజాత – ఆటపాటల్లో ఆరితేరిన ఆరిందా... వలపు చూపులతో మాయ మాటలతో ఒక గృహస్థుని మనసును ఆకర్షించి, స్వర్గ తుల్యమైన అతని సంసారంలో చిచ్చుపెట్టే పాత్ర అది. నిజానికి ఆ దుష్ట నాయకి పాత్ర ఆమె స్వభావానికే విరుద్ధమైనది. ఈ కేరెక్టర్ కోసం తను పుట్టలేదేమో అనిపించకపోలేదామెకు మొదట్లో.

త్రివిధ మనస్తత్వాలు గల ఆ పాత్రను ఎలా పోషించడం? అందుకు తగ్గ శక్తి సామర్ధ్యాలు తనలో లేవే అని మధనపడసాగింది భానుమతి. కాని, శ్రీ బి.ఎన్. రెడ్డిగారు ఆమెలో లేని ధైర్యాన్ని కలిగించి, చివరికి ఎలాగైతేనేం – ఆ పాత్రను ఆమె ధరించడానికి ఒప్పించారు.

ప్రఖ్యాత హాలీవుడ్ తార రీటా హేవర్త్ నటించిన 'బ్లడ్ అండ్ సాండ్' అనే అమెరికన్ చిత్రం నించే 'స్వర్గసీమ' చిత్రంలోని ఆమె కేరెక్టర్ సృష్టించబడింది.

"ముందు మీరోసారి ఆ అమెరికన్ చిత్రాన్ని చూడండి." అని రెడ్డిగారు చెప్పి వెళ్ళిపోయారు. అలాగే వెస్టెండ్ (ఇప్పుడు మద్రాసులోని మిడ్ లాండ్) థియేటర్ లో భానుమతి అ చిత్రం చూసింది. అందులో రీటా ప్రదర్శించిన నటనకు భానుమతి ముగ్ధురాలయింది. రీటాను తెరమీద చూస్తున్నంత సేపూ భానుమతిలో ఏదో నూతనోత్సాహం పొంగసాగింది. గిటార్ చేతబట్టి అందులో పాడిన ఓ పాట ఆమె చెవిని ఇల్లు కట్టుకు నిలిచిపోయింది.

ఆ చిత్రం చూసి వచ్చాక నాగయ్య గారికి ఆ పాట బాణీని వినిపించిందామె. ఆయన 'స్వర్గసీమ' చిత్రానికి సంగీత దర్శకులు. ఆమె పాట విని ఆయన అమాంతంగా విస్తుపోయారు. "అమ్మాయ్, నువ్వే స్వయంగా పాడేటట్లయితే, ఆ బాణీని సుజాత పాటకు ఈ చిత్రంలో ప్రవేశ పెట్తా" అన్నారాయన.

త్యాగరాయనగర్ లోని వాహినీ పిక్చర్స్ కార్యాలయం మేడ మీద నాగయ్య గారూ, నిర్మాత – దర్శకులు బి.ఎన్.రెడ్డిగారూ, భానుమతీ ఆ పాటకు 'బాణీ' కూర్చారు. ఆ బాణీకి అనుగుణంగా రాయబడిన గీతం ఆమె చేతికి ఇవ్వబడింది.

అలా వాహినీ కార్యాలయం మేడమీద బ్రహ్మాండంగా హిట్ అయిన 'ఓహోహో–పావురమా!' అనే పాట పుట్టింది.

ఈ నాటికీ అంత భావగర్భితంగా ఎవరు పాడినా ఆ పాటలో ఏదో జీవం ఉట్టిపడుతూనే ఉంటుంది.

'స్వర్గసీమ' చిత్రంలో భానుమతి ఆ పాటను మైక్ ముందు పాడుతున్నప్పుడు, సెట్ మీద నటిస్తున్నప్పుడూ కూడా ఆమె స్మృతి పథంలో రీటాహేవర్త్ సదా మెదులుతూనే ఉండేది. "ఆ చిత్రంలో నా నటన పండిత పామరుల ప్రశంసలనందుకున్నదంటే – ఆ ఘనతంతా రీటాదే. నిజానికి ఆ పాత్ర విషయంలో నేనామెకు ఎంతో ఋణపడి ఉన్నాను," అంటుంది భానుమతి.

'స్వర్గసీమ' లో నటించడానికి పూర్వం ఆమె అప్పుడప్పుడు కెమేరా ముందు కాస్త సంకోచిస్తూనే నిలుచొనేది. కాని, ఒకటి రెండు చిత్రాల తర్వాత ఆమెలోంచి ఆ జంకు గొంకులు అంతర్ధానమై పోయాయి. తనకు తగిన, తనకు నచ్చిన పాత్ర లభిస్తేనే కాని నటించలేనేమో అన్న భీతి కూడా ఆమె లోంచి తొలగిపోవడంతో విభిన్న స్వభావాలు గల పాత్రలను సునాయాసంగా నిర్వహించే మనో నిబ్బరమూ, ధైర్యమూ ఆమెలో కలిగాయి.

అంచేత తొలుత భానుమతి నటించాలనుకుని నటించలేదు. ఆ నటన అనేది (ఆమెలో అజ్ఞాతంగా దాగి ఉందేమో అప్పుడు ఆమెకే తెలియదు) ఆమెలోంచి స్వభావసిద్ధంగా బయటకు ఊడిపడేది. ఇప్పుడు మాత్రం తను నటించాలి _ అనుకునే నటిస్తోందామె. అవును ఆమె అలా క్రమేపీ నటిగా మారింది. 'సాధనమున పనులు సమకూరు ధరణిలో' అన్న వేమన్న సూక్తి అక్షరాలా నిజమయింది.

ఒకప్పుడు 'మంగమ్మ శపథం' అనే జెమినీ వారి తమిళ చిత్రాన్ని భానుమతి చూసింది అందులో మంగమ్మ పాత్ర ఆమెనెంతో ఆకర్షించింది చిలిపిదనం, శక్తి సామర్థ్యాలు ఇత్యాది ఎన్నో విశేషాలు గల పాత్ర అది.

"అటువంటి క్లిష్టమైన పాత్రను ధరించాలని ఉందండీ నాకు," అని భర్త శ్రీ రామకృష్ణతో తన మదిలోని కోర్కెను ఎరుగపరిచింది భానుమతి ఓ రోజు.

"మళ్ళీ వాసన్ గారే ఆ చిత్రాన్ని ఏ హిందీలోనో, తెలుగులోనో తీస్తే తీయవచ్చు. అయినా, ఆ పాత్ర నీకే లభిస్తుందని ఎలా అనుకోగలం? అంచేత ఆ కోర్కెను నీ మనుసులోంచి తొలగించుకోవాల్సిందే." అన్నారాయన.

"మీరిలా నిరాశ కల్గిస్తే ఎలాగండీ? నేను వాసన్ గారిని ఎక్కడైనా కలుసుకోవడం జరిగితే, ఈ విషయం గురించి వారితో చెప్పడానికి సంకోచించను." అందామె నవ్వుతూనే.

అయితే, అప్పటికే వాసన్ గారు ఆ చిత్రాన్ని తెలుగు హిందీ భాషల్లో పునర్నిర్మించడానికి పూనుకున్నారన్న విషయం ఆమెకు గాని, రామకృష్ణ గారికి కాని తెలియనే తెలియదు. విచిత్రమేమిటంటే, వాళ్ళిద్దరికీ ఆ సంభాషణ జరిగిన పక్షం రోజులకే వాసన్ గారి దగ్గర్నించి వాళ్ళకు ఫోన్ కాల్ వచ్చింది.

"వసుంధరాదేవి(వైజయంతి మాల తల్లి) 'మంగమ్మ' తమిళ చిత్రంలో తనే స్వయంగా పాడి అత్యద్భుతంగా నటించింది. అప్పట్లో ఆ పాత్రను పోషించడానికి తగు శక్తి సామర్థ్యాలు గల నటి ఆమె ఒక్కతే అలాగే ఇప్పుడు మీ శ్రీమతి గారొక్కరే నా హిందీ తెలుగు చిత్రాలలో ఆ పాత్రను ధరించగల స్థోమత గలవారు. ఇంకెవ్వరూ ఆ పాత్రకు సరిపోరు. ఏమంటారు ?" అన్నారట వాసన్ గారు శ్రీ రామకృష్ణతో.

"నువ్వేమంటావ్?" అన్నారాయన భానుమతితో. అప్పుడామె ఏమని ఉంటుందో ఇక్కడ మళ్ళీ రాయాల్సిన అవసరం లేదనుకుంటా. నటిగా ఆమె జీవితంలో పొందిన ఆనందం ఇంతా అంతా కాదు _ అంటే ఆ రోజే !

ఆ మర్నాడే వాసన్ గారు వాళ్ళ భవనానికి వచ్చారు 'మంగళ'లో కథానాయకి పాత్రకు భానుమతి బుక్ అయింది.

అయితే అనుకోకుండా అకస్మాత్తుగా ఏర్పడిన ఓ చిన్న మార్పు ఆమెలో అమాంతంగా నిరుత్సాహాన్ని కాస్త కలిగించకపోలేదు 'మంగళ'ను నిర్మించడానికి ముందు వాసన్ గారు 'అపూర్వ సహోదరులు' చిత్రాన్ని తయారు చేయ నిశ్చయించినట్లు, ఆ తర్వాతే 'మంగళ' తీయడం జరుగుతుందని చెప్పారు. బొంబాయిలో ఒక నిర్మాత ఆ కథనే చిత్రీకరించడానికి సన్నాహాలు చేస్తున్నాడని తెలిసినందు వల్లే వాసన్ గారు హుటాహుటిగా ఆ నిర్ణయానికి రావడం జరిగింది.

అయితే ఆ నిరుత్సాహం తాత్కాలికమైనదే కదా అని భానుమతి తనకు తాను నచ్చ చెప్పుకొని, తృప్తి పడింది. అయినా, ఆ 'అపూర్వ సహోదరులు' చిత్రంలో ఆమె ధరించిన పాత్రకూడా చాలా క్లిష్టమైనదే. ఆ పాత్ర కాస్త చిన్నదైనా ఆమెలోని నటనా కౌశలాన్ని ప్రదర్శించడానికి వీలయింది. ఆ చిత్రం ద్వారానే భానుమతి అఖిల భారత మేటి నటిగా ఖ్యాతికెక్కింది.

ఆమె భర్త శ్రీ రామకృష్ణ దర్శకత్వంలో వాళ్ళ సొంత భరణి సంస్థ నిర్మించిన తొలిచిత్రం 'రత్నమాల'. ద్వితీయ చిత్రం 'లైలామజ్ను'తో తెలుగు చిత్ర చరిత్రలో నూతనాధ్యాయం ప్రారంభమైందనే చెప్పి తీరాలి. నటీ నటుల పాత్ర పోషణ, సాంకేతిక నిపుణుల పనితనం, అన్ని శాఖల్లోనూ ఉన్నత శిఖరాలను అందుకున్న ఆ చిత్రం బ్రహ్మాండమైన విజయం సాధించింది తెలుగు, తమిళ భాషల్లో కూడా. అదే సమయంలో తమిళంలో అప్పటి పేరు మోసిన హీరో టి.ఆర్. మహలింగంతో పోటీగా విడుదలయిన బాలాజీ వారి 'లైలామజ్ను' చిత్రం టుప్ మని ఎగిరి పోయింది. 'ప్రేమ, చక్రపాణి, వరుడు కావాలి. విప్రనారాయణ, చింతామణి' ఇత్యాది చిత్రాలను భరణి సంస్థ నిర్మించింది.

ఆబాలగోపాలం 'మల్లీశ్వరి' భానుమతి నటనకు ఒక గీటురాయిగా నిర్ణయించారు. ఆమె 'మహానటి' అని వేనోళ్ళ పొగిడారు. నిజమే, ఆ చిత్రంలో ఆ క్లిష్టమైన పాత్రను అతి జాగ్రత్తతో పోషించడానికి భానుమతి తన శక్తి సామర్థ్యాలనంతా వినియోగించవలసి వచ్చింది. సుప్రసిద్ధ నిర్మాత దర్శకుడు శ్రీ బి.ఎన్.రెడ్డి సమర్పించిన ఆ చిత్రంలో 'మనసున మల్లెల మాలలూగెనే' అనే పాటను ఎప్పటికీ మనం మరచిపోలేము.

భానుమతిని 'డైరక్టర్' గా చేసిన చిత్రం 'చండీరాణి'. ఆమె అలా దర్శకత్వ బాధ్యతను తలమీద వేసుకోవడం కాకతాళీయంగా జరిగినదే. అయితే, "ఆ విషయంలో జ్యోస్యం కూడా కొంత ఫలించిందని చెప్పక తప్పదు." అంటుంది భానుమతి నవ్వుతూ.

వాళ్ళ కుటుంబానికి ఒక గురూజీ పరిచయమయ్యారు. ఆయన్ని భానుమతీ రామకృష్ణలు తరచు కలుసుకరావడం పరిపాటి. ఒకసారి ఆయన "ఇంకో ఆర్నెల్లల్లో మీరు చిత్ర దర్శకులైనా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు," అన్నారు భానుమతితో. అప్పటికి ఆ దంపతులిద్దరూ నవ్వి ఊరుకున్నారు. అసలా తర్వాత ఆ విషయాన్ని మర్చిపోయారు కూడా.

ఒకరోజు మాటల సందర్భంలో "మన కొత్త చిత్రానికి కథ గురించి ఏం చేశారు?" అంది భానుమతి, శ్రీ రామకృష్ణతో.

ఆయన ఒక కథను వినిపించి. "ఈ చిత్రాన్ని నువ్వే తీసేయ్... నేను మరో (బ్రతుకు తెరువు) చిత్రాన్ని డైరెక్ట్ చేయడానికి ఒప్పుకున్నాను." అన్నారు.

"అదేమిటండీ?" అంది భానుమతి దిగాలుగా చూస్తూ.

"ఏం? నువ్వు డైరెక్ట్ చెయ్యలేవా? అందుకు తగ్గ శక్తి సామర్ధ్యాలు, అనుభవం ఉండి కూడా అంత ధైర్యం లేకపోతే ఎలా? ధృఢ చిత్తంతో ముందంజ వెయ్యి. అవసరముంటే అప్పుడప్పుడు సెట్ మీదికి వచ్చి సలహాలిస్తుంటాలే.." అన్నారు రామకృష్ణగారు.

ఆయన ప్రోత్సాహమే ఆమెలో లేని ధైర్యాన్ని కలిగించింది.

'చండీరాణీ'లో కథానాయిక పాత్రలు రెండు ఆ ద్విపాత్రాభినయనాన్ని భానుమతి ఓ వైపున నిర్వహిస్తూ, మరో వైపున దర్శకత్వ బాధ్యత కూడా తనే చూసుకోవాలి. తానే కదా నటించేది అనే అశ్రద్ధకాని, దర్శకత్వ బాధ్యత కూడా తనదే అన్న భీతి కాని కలగకుండా చూసుకోవడంలో భానుమతి చాలా సతమతమై పోయింది. పైగా అది త్రిభాషా చిత్రం కూడా.

"భానుమతి ఏమిటి, డైరెక్టర్ గా ఆమెకు ఉన్న అనుభవమేమిటి?" అనే తలంపుకు తావియ్యకుండా, అలక్ష్యం ఏ మాత్రం చేయకుండా సాంకేతిక నిపుణులందరూ ఆమెతో కాస్త భయపడుతూనే సహకరించారు.

ద్విపాత్రాభినయనం విషయంలో తనే రెండు పాత్రలలో అగుపించవలసిన దృశ్యంలో కెమెరాను ఎక్కడ ఉంచాలి, ఎలా ట్రిక్ ఫోటోగ్రఫీ నిర్వహింపజేయాలి – అనే విషయాలలో భానుమతికి కాస్త అనుభవం లేకపోయినా ఆమె నిర్దుష్టమైన పద్ధతిలోనే తన బాధ్యతను నిర్వహించింది. చివరికి ప్రయత్నం ఫలించింది. అంత చక్కగా అన్ని బాధ్యతలూ తానేలా నిర్వహించానా అన్న ఆశ్చర్యం ఆమెలో కల్గకపోలేదు. పూర్తయ్యాక చిత్రం చూసి ఆమె భర్త కూడా చాలా ఆశ్చర్యపడ్డారు.

"చండీ రాణి – చిత్రం కోసం నే పడ్డ శ్రమ, చింత నన్ను ఒక్క ఏడాదిలోనే మరో పది సంవత్సరాల వయసు మీరినట్లు చేశాయి." అంటుంది భానుమతి తృప్తిగా నిశ్వాస వదులుతూ.

చివరికి ఎలాగైతేనేం–ఆమె ఒక చిత్రాన్ని డైరెక్ట్ చేసింది. వాళ్ళ గురూజీ చెప్పిన మాట నిజమైంది.

కాని, ఆమె భర్త మాత్రం ఆ చిత్ర నిర్మాణానికి ముందు ఆమెకిచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారు. ఆయన ఒక్క రోజైనా భానుమతికి సహాయంగా సెట్ మీదికి పర్యవేక్షణకు గాను వచ్చిన పాపాన పోలేదు అందుకు కారణం – ఆ సమయంలో ఆయన 'బ్రతుకు తెరువు' చిత్ర దర్శకత్వంలో మునిగి ఉండడమే.

తను దర్శకత్వం వహించిన 'చండీరాణి' ఒక మోస్తరుగా డబ్బు చేసుకుంది కాని, అదే సమయంలో తన భర్త డైరెక్ట్ చేసిన 'బ్రతుకు తెరువు' చిత్రం మాత్రం విజయఢంకా మ్రోగించింది అయినా, 'చండీరాణి' చిత్ర నిర్మాణంలో తనకు కలిగిన వినూత్నానుభవాలను అనుభూతులను. ఆ చిత్రం చూచిన అభిమానులు తన పట్ల చూపిన ఆదరాభిమానాలతో సంతృప్తి చెందుతూ; ఆ చిత్రం అంతగా విజయం సాధించలేకపోయిందనే అసంతృప్తిని భానుమతి తనలోంచి తొలగించుకుంది. అప్పుడు ఏదో ఉత్సాహంలో, ఉద్వేగంలో 'చండీరాణి' చిత్రం కోసం భానుమతి అంతగా పదరాని పాట్లు పడిందే కాని, మళ్ళీ అలా అన్ని బాధ్యతలనూ మరోసారి ఆమె తన మీద వేసుకో గలదో లేదో?

'రాజభక్తి' అనే తమిళ చిత్రంలో భానుమతి 'మందాకిని' అనే దుష్టనాయకి పాత్ర ధరించింది అది ఆమెకు గిట్టని, ఆమె స్వభావానికి పొసగని పాత్ర అయినా, ఆ పాత్రను ఒక విశిష్ట పంథాలో నిర్వహించదానికి ఆమె ముచ్చట పడింది. ఆ పాత్రకు 'ది కింగ్ అండ్ ఐ' అనే చిత్రంలో ప్రఖ్యాత అమెరికన్ నటుడు యూల్ బ్రిన్నర్ చూపిన హావభావ ప్రకటనలు ఆమెకు ఇన్ స్పిరేషన్ ఇచ్చాయి. భానుమతి ఒక్క పాటయినా పాడని చిత్రం ఆ 'రాజభక్తి' అనే చిత్రమే. పాత్ర అన్నింటిలో భానుమతిని ఎక్కువగా ఆకర్షించినది 'బడదీది'. అది ఇంతవరకు ఆమె నటించిన పాత్రలన్నిటికీ ఎంతో విభిన్నమైనది. ఆ మిగతా

పాత్రలన్నీ ఒక ఎత్తు; 'బడదీది' ఒక ఎత్తు. ఇందులో చిలిపిదనంతో కూడిన పల్లె బాలిక వేషం లేదు. జీవితంలో ఒడుదుడుకుల్ని వేదాంతం వెనుక అణచి పెట్టిన ఒక స్త్రీగాథ అది.

అంతకన్నా క్లిష్టమైనది "అణ్ణయ్" అనే తమిళ చిత్రంలో తను ధరించిన పాత్ర అంటుంది భానుమతి. అదే చిత్రం తెలుగు వర్షన్ లో ఆమె నటన మన ఊహా శిఖరాలను మరింత అధిగమించవచ్చు – అనడంలో అతిశయోక్తి ఏమీ ఉండదు.

★★★

★★★

## వచ్చేనెల మరో ఫ్లాష్ బ్యాక్

COMMENTS